ఈనాడు
epaper.eenadu.net

నిందితుల గుర్తింపు పక్కా..



సంచార ఫోరెన్సిక్ వాహనం వద్ద ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, చిత్రంలో ఫింగర్ ప్రింట్స్ ఏఎస్సై మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు జరిగేటప్పుడు నేరస్థులకు శిక్ష పడాలంటే శాస్త్రీయ ఆధారాలు కీలకం. ఘటనా స్థలిలో లభించిన ఆధారాలను ఫోరెన్సిక్ ప్రయోగశాలలో విశ్లేషించి నివేదికను పోలీసులకు అందజేయాలి. అందుకు గానూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో..నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలకు ప్రత్యేక వాహనాలు రాగా, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఇంకా రావాల్సి ఉంది.

అక్కడికక్కడే..

నేరాలు జరిగితే క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తుంది. వాటిని రాష్ట్ర రాజధానిలో ఉన్న ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపిస్తే నిపుణులు విశ్లేషించి నివేదిక ఇస్తారు. ఇందుకు మూడు నుంచి అయిదు రోజులవ్వడంతో జాప్యమవుతోందని గుర్తించిన ప్రభుత్వం సంచార ఫోరెన్సిక్ వాహనాలను కేటాయించాలని నిర్ణయించింది. గుజరాత్‌లో ఉన్న ఎన్ఎఫ్ఎస్‌యూ (నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ) వాహనాలను రూపొందించిందని, అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోప్, ఏసీ, జనరేటర్, రిఫ్రిజిరేటర్, ల్యాప్‌టాప్, సీసీ కెమెర్లాంటి ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని నాగర్‌కర్నూల్ ఫింగర్ ప్రింట్స్ ఏఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

అన్నీ అందులోనే..

ఫోరెన్సిక్ వాహనంలో ఆధునిక యంత్రాలు, అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి వాహనానికి క్లూస్ టీంను కేటాయించారు. సంఘటనా స్థలికి చేరుకొని.. వేలిముద్రలు, డీఎన్ఏ, రక్తపు మరకలు వంటివి సేకరిస్తారు. కాగితాలు, ఆయుధాలు, బుల్లెట్ల లాంటివి పరీక్షించే సదుపాయమూ ఉంది. అగ్నిప్రమాదాలకు సంబంధించిన కారణాలను ప్రాథమికంగా గుర్తించే అవకాశం ఉంటుంది. 14 రకాల శాస్త్రీయ కిట్లు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు ఒక సంచార ఫోరెన్సిక్ వాహనాన్ని కేటాయించినట్లు నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. నేరస్థలిలో ఆధారాలు సేకరించడంలో వేగం పెరుగుతుందని అవసరమైన అన్ని పరీక్షలను వాహనంలోనే చేసి నిందితులను వెంటనే గుర్తించవచ్చన్నారు.

Date : 10/09/2025 EditionName : TELANGANA(NAGARKURNOOL) PageNo : 01